పల్లెల్లో పారిశుధ్యం అధ్వానం

- మురుగుతో పేరుకుపోతున్న కాలువలు
- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- ప్రబలుతున్న అంటువ్యాధులు

బొబ్బిలి రూరల్ : ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, క్షేత్రస్థాయిలో వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. లేదంటే అంతే సంగతులు. ప్రస్తుతం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుధ్య పనులు కూడా అంతంతమాత్రంగానే చేపడుతూ చేతులు దులుపుకోవడంతో అనుకున్న ఫలితాలు రావడం లేదనే చెప్పాలి. మండలంలోని చాలా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రచార ఆర్భాటం కోసమే అధికారులు కార్యక్రమాలు చేపడుతున్నారు తప్ప పక్కాగా వాటిని ఆచరించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో 30 పంచాయితీలుండగా మేజర్ పంచాయితీలుగా దాదాపు 10 గ్రామాలున్నాయి. ఆయా మేజర్ పంచాయతీల్లో కూడా పారిశుధ్యం అంతంతమాత్రంగానే ఉంది. ముఖ్యంగా బొబ్బిలి - తెర్లాం రహదారిపై ఉన్న కారాడ గ్రామ పంచాయతీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. కాలువలు పూడికలతో నిండిపోవడంతో రోడ్డుపైన మురుగునీరు ప్రవహిస్తోంది. నిత్యం ఇదే రహదారిపై అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. కాని ఒక్కరు కూడా పారిశుధ్య పనులపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామంలో అంటురోగాలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాల బారిన చాలా మంది పడ్డారని, అధికారులు స్పందించి పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


గ్రామంలో ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు


మురుగుతో నిండిని కాలువ

పారిశుధ్యం క్షీణించింది..

గ్రామంలో పారిశుధ్యం బాగా క్షీణించింది. కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. ఇప్పటికే గ్రామంలో చాలా మంది జ్వరాల బారిన పడ్డారు. కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలి.

– రంప కృష్ణ, రైతు, కారాడ

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

- సీఐ నారాయణరావు


అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు, పక్కన ఎస్సై ప్రసాదరావు

రామభద్రపురం: గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నారాయణరావు అన్నారు. మండలంలోని నరసాపురంలో ఎస్సై వి. ప్రసాదరావుతో కలిసి ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో చాలామంది సైబర్ మోసాలకు గురవుతున్నారన్నారు. అనవసర లింకులను క్లిక్ చేయడం, గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్ చాటింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అటువంటి మోసాలకు గురైనప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 100కు డయల్ చేయాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ రక్షణగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజాం: భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు వెంటనే ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, కార్యదర్శి ఎ.జగన్మోహనరావు కోరారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి లేబర్ ఆఫీసు వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే సంక్షేమ పథకాలను అమలు చేయాలని, క్షేత్రస్థాయిలో ప్రతీ కార్మికుడికి పథకాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోరెడ్డి విశ్వనాథం, మడపాన తిరునాథ్ పాల్గొన్నారు.

నేడు 'సంకల్పం'

బొబ్బిలి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సంకల్పం అనే చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఐ కె. సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ వకుల్ జిందాల్, సినీనటుడు సాయికుమార్ ముఖ్య అతిథులుగా స్థానిక సూర్య రెసిడెన్సీలో నిర్వహించే సంకల్పం కార్యక్రమానికి విద్యార్థులు, యువత హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై జి. భాస్కరరావు తెలిపారు. ఇసుక తరలిస్తున్న చెల్లారపువలసకు చెందిన గొట్టాపు రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


ఉంగరాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ఉపేంద్ర

రేగిడి: గ్రామాల్లోని యువత చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర యువతకు సూచించారు. మండలంలోని ఉంగరాడ గ్రామంలో ఆదివారం అవగాహన కల్పించారు. మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వీటికి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. యువత బాగా చదువుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. చిన్నచిన్న సమస్యలకు గొడవలు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

రంగుబుట్టల ఏర్పాటుతో చీడపీడల నివారణ


చాటాయివలసలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: వరి పొలాల్లో రైతులు రంగుబుట్టలు ఏర్పాటుచేసుకుంటే చీడపీడల నివారణకు దోహదపడుతుందని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని చాటాయివలస, వండానపేట, గుళ్లపాడు గ్రామాల్లో ఆదివారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని, తెగుళ్ల నివారణకు రైతులు పసుపురంగుతో కూడిన అట్టబుట్టలను పొలాల్లో ఏర్పాటుచేసుకుంటే పురుగులు బుట్టల వైపు చేరుతాయని, పంటకు నష్టం తగ్గుతుందని వెల్లడించారు.

బంగారినాయుడు మృతి పార్టీకి తీరని లోటు


బంగారినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మజ్జి శ్రీనివాసరావు, డాక్టర్ రాజేష్, తదితరులు


బంగారినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: బూరాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వావిలపల్లి బంగారినాయుడు మృతి పార్టీకి తీరని లోటు అని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. బూరాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బంగారినాయుడు సంతాపసభలో వారు పాల్గొన్నారు. బంగారినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు సర్పంచ్‌గా సేవలందించిన బంగారినాయుడు గ్రామాభివృద్ధికి ఎంతో సహకరించారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, కేవీ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, పాలవలస శ్రీనివాసరావు, సర్పంచ్‌లు వావిలపల్లి శశిభూషణరావు, కరణం శ్రీనివాసరావు, గార రమణ, లెంక రాంబాబు, రమేష్‌నాయుడు, బడుమూరు పట్టాభి, బాబూరావు, గంటా మోహనరావు, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, ఎర్నేన అప్పలనాయుడు, పొగిరి అప్పలనాయుడు, బొక్కేల రాంబాబు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కాండం కుళ్లు తెగులు

రాజాం: విస్తారంగా కురిసిన వర్షాలకు మండలంలో సాగుచేస్తున్న మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొగిరి, వీఆర్ అగ్రహారం, అంతకాపల్లి, నందబలగ, బొద్దాం, పెనుబాక, గడిముడిదాం, దోసరి, ఆగూరు తదితర గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న పంటను అధికంగా సాగుచేస్తున్నారు. పంట పూతకు వచ్చే సమయంలో వరుసగా వర్షాలు కురవడంతో పాటు పొలాల్లో నీరు చేరి నిలిచిపోవడంతో పంటకు కాండం కుళ్లు తెగులు ఆశించింది. సకాలంలో వ్యవసాయశాఖ స్పందించకపోవడంతో చాలా ప్రాంతాల్లో పంట ఊదా రంగులోకి మారిపోయి, కంకిలు ఎండిపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన ప్రాంతాలను గుర్తించి, నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

- లైబ్రేరియన్ కృష్ణమూర్తి


తెర్లాం: విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం ద్వారా మంచి జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరి, ప్రతిరోజూ వార్తా పత్రికలు, కథలు, కాంపిటేటివ్ పుస్తకాలు చదవాలని సూచించారు.


బాడంగి: విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం..

బాడంగి: స్థానిక శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయాలి...


ధర్నా చేస్తున్న మాల ఉద్యోగుల సంఘ నాయకులు

బొబ్బిలి: భారతరత్న అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి దళిత జాతినే అవమానించిన ఉండి శాసనసభ్యుడు రఘురామ కృష్ణంరాజును, దళితులను అవమానించిన మరో ఎమ్మెల్యే పంతం నానాజీలను వెంటనే అరెస్ట్ చేసి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, అంబేడ్కర్ పోరాట సమితి నాయకులు సోరు సాంబయ్య, డాక్టర్ కొలు చిరంజీవు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు, అంబేడ్కర్ పోరాట సమితి నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాలను నిలిపివేసి దళితులకు న్యాయం జరగాలంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి


అంబఖండిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

రేగిడి: ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సీహెచ్ పద్మ అన్నారు. మండలంలోని అంబఖండి గ్రామంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, క్లాప్ మిత్రులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసపు గోవిందనాయుడు, పంచాయతీ కార్యదర్శి హేమసుందరరావు, అంబళ్ల సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లాభదాయకంగా మొక్కజొన్న


కందిశ సమీపంలో రోడ్డుపై ఆరబెట్టిన పప్పు

రేగిడి: మండలంలో ఈ ఏడాది రైతులు అధికంగా మొక్కజొన్న పంటను సాగుచేశారు. ప్రస్తుతం పంట కోతదశకు చేరుకోవడంతో రైతులు పంటను దక్కించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎకరాకు 22 క్వింటాళ్ల వరకూ మొక్కజొన్న పప్పు దిగుబడి వస్తుందని, క్వింటా ధర రూ.2200లు వరకూ పలుకుతుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోని రైతులు పంటను నూర్పిడిచేసి, పప్పును విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై గోపాలరావు

సంతకవిటి: మండలంలోని కేర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద ఎస్సై ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వాహనా చోదకులపై అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు తమ వెంట వాహన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని, సీట్ బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించ కూడదని ఎస్సై సూచించారు. మైనర్లకు వానాలు ఇస్తే సదరు వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు పద్యపఠన పోటీలు


కరపత్రం ఆవిష్కరిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో అక్టోబర్ 20న పద్య పఠన పోటీలు నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాషా సాహిత్యాన్ని, మన సంస్కృతిని కాపాడడంతో పాటు పిల్లల్లో ధారణశక్తి, నైతిక విలువలు పెంపొందించేందుకు వేమన, సుమతి శతక పద్య పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. పద్యాలు, వాటి భావాలు చూడకుండా చెప్పాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వేరువేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8500889795, 8897362962, 8106746229 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మురపాక గణేష్, వాకచర్ల పైడిరాజు, గెడే అప్పలనాయుడు, ముడిల శంకరరావు, కరణం శంకరరావు, పట్నాన కృష్ణ, చిక్కాల రవికుమార్, పల్ల నారాయణరావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

బొబ్బిలి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రెండు గేట్ల ద్వారా నీరు విడుదల

వంగర: మండలంలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద ఆదివారం రెండు గేట్లు పైకెత్తారు. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి వచ్చి చేరడంతో రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడిచిపెడుతున్నట్లు ఏఈ నితిన్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 64.55 మీటర్ల నీటిమట్టం ఉన్నట్లు చెప్పారు.

అక్టోబర్ రెండు నుంచి గ్రామసభలు

బొబ్బిలి రూరల్ : ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టబోయే పనుల కోసం అక్టోబర్ రెండో తేదీ నుంచి మూడు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి. రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 ఏడాదికి సంబంధించి చేపట్టనున్న పనుల గుర్తింపు, ప్రణాళికల రూపకల్పనపై చర్చించనున్నారు. ప్రజల భాగస్వామ్యంతో నాణ్యమైన పనులు గుర్తించేందుకు సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

37 మద్యం సీసాలు స్వాధీనం

వంగర: మండలంలోని మగ్గూరులో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు చేపడుతున్న బెల్టుషాపులపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి నుంచి 24 మద్యం బాటిల్స్, మరో మహిళ వద్ద 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

బాధ్యతల స్వీకరణ



బొబ్బిలి: ఎక్సైజ్ సీఐగా పి. చిన్నంనాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇక్కడ ఎస్ఈబీ ఎస్సైగా పనిచేశారు. సర్కిల్‌లో సారా తయారీ, బెల్ట్ షాపుల నిరోధానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన విలేకరులకు తెలిపారు.

యూసీమాస్‌తో ఉజ్వల భవిష్యత్

బొబ్బిలి: యూనివర్శల్ కాన్సెప్ట్ మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్ (యూసీ మాస్) ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, తదితర స్కిల్స్ పెరిగి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సిద్ధిస్తుందని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో యూసీమాస్ డెమో క్లాస్, ప్రతిభ గల విద్యార్థులకు అవార్డుల అందజేత కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అభ్యుదయ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద, ఎం. శ్రీకాంత్, ఆరో వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు, న్యాయవాది మల్లారు మోహన్ కుమార్, సాయి చాందిని, ఎం. స్వప్నమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం


సత్కారం పొందిన ఉపాధ్యాయులతో మానవతా సంస్థ సభ్యులు

రాజాం సిటీ: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఆరుగురు ఉపాధ్యాయులను మానవతా సంస్థ ఆధ్వర్యంలో సత్కారించారు. సంస్థ కార్యాలయంలో ఉపాధ్యాయులు బొత్స జానకీరావు, ఎస్.జయకృష్ణ, వై.సీతంనాయుడు, ఎస్.ఉషారాణి, పి.కృష్ణవేణి, ఎం.శ్రీరాములను ఆదివారం మెమొంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి బాగున్నప్పుడే గుర్తింపు లభిస్తుందని, అటువంటి గుర్తింపు ఈ ప్రాంతంలో ఆరుగురికి రావడం అభినందనీయమన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ఉపాధ్యాయులు జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, గట్టి పాపారావు, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, శాసపు సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, దామెర రాజ, పిడుగు సూర్యారావు, ఓజేసీపీ కుమార్, వాకచర్ల పైడిరాజు, తవిటిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుస్తకావిష్కరణ..


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పాస్టర్ సంపత్‌కుమార్ భాష్యం, పాస్టరమ్మ వినోలియా భాష్యం

తెర్లాం: మండలంలోని కూనాయవలస క్రీస్తు ప్రార్థనా మందిరంలో 'ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము పోరాడుడి' అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. పుస్తక రచయిత సంపత్‌కుమార్ భాష్యం మాట్లాడుతూ, నేటి క్రైస్తవ సంఘాల్లో తప్పుడు బోధలు, తప్పుడు సిద్ధాంతాలు ఎక్కువైపోతున్నాయని, వాటి నుంచి క్రైస్తవ సంఘాలను, విశ్వాసులను సరైన మార్గంలో నడిపించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకం రాసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రతాప్‌కుమార్, వినోలియా భాష్యం, ఎఫ్రాముయి, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం


హతమైన కొండచిలువ


బొబ్బిలి: పట్టణ పరిధిలోని బలిజిపేట రోడ్డులో భారీ కొండచిలువను స్థానికులు ఆదివారం హతమార్చారు. మున్సిపాలిటీలోని 8 వార్డు నివాసప్రాంతంలోకి కొండచిలువ వస్తుండడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే యువత స్పందించి సుమారు పది అడుగుల కొండచిలువను హతమార్చడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై ప్రసాదరావు, తదితరులు

రామభద్రపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై వి. ప్రసాదరావు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలు నడిపే ముందు ఒక్కసారి కుటుంబం గురించి ఆలోచించాలని సూచించారు. అతివేగం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, యువత ఎక్కువగా మృత్యువాత పడుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు.

మలిపొద్దు మురిపించెన్



రేగిడి: మండలంలో వన్నలి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయం కనువిందుచేసింది. నీలిమేఘాల చాటు నుంచి లేలేత పసుపురంగులో భానుడు ప్రకాశిస్తూ కనిపించాడు. పచ్చని పైరుపై ఆ అందాలు తనివితీరని ఆహ్లాదాన్ని పంచిపెట్టి మురిపించాయి.

నవదుర్గామాత ఆలయం మూసివేత

రాజాం: శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న నవదుర్గామాత ఆలయం ముస్తాబవుతోంది. ఈ మేరకు ప్రస్తుతం ఆలయ గర్భగుడి మూసివేసి అమ్మవారి మూలవిరాట్‌ను ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. అక్టోబర్ 3 నుంచి గర్భగుడి దర్శనాలు పునఃప్రారంభించనున్నారు. ఈ నాలుగు రోజులు ఆలయం బయట, లోపల సుందరీకరణ పనులు చేయడంతో పాటు తొమ్మిది శక్తిపీఠాలను పూజలకు సిద్ధం చేయనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. వచ్చే నెల 3 నుంచి పది రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు.

చేయిచేయి కలిపారు.. సీడ్ బాల్స్ సిద్ధం చేశారు


విత్తన బంతులు తయారీలో విద్యార్థులు

రాజాం: మండలంలో పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీడ్ బాల్స్ (విత్తన బంతులు) తయారీలో భాగస్వాములయ్యారు. రాజాం వాసవీ వనితాశక్తి సంస్థ పిలుపుమేరకు పాఠశాల విద్యార్థులు 10 వేల విత్తన బంతులు తయారు చేసినట్లు హెచ్ఎం ఆదివారం వెల్లడించారు. వాటిని పలుచోట్ల వేసి మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.